# అధ్యక్షా.. ఆలకించండి

## అసెంబ్లీలో పలు సమస్యలు ప్రస్తావించిన సభ్యులు

- అధికార చిహ్నంలో వాటిని తొలగించొద్దు: కడియం శ్రీహరి
- చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలి: పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులను పరిష్కరించాలి: పాడి కౌశిక్‌రెడ్డి
- ప్రొటోకాల్ పాటించకుండా అవమానిస్తున్నారు: పైడి రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అధికార చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను తొలగించవద్దని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రభుత్వాన్ని మరోమారు డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని అసెంబ్లీ జీరో అవర్‌లో మరోసారి ఆయన ప్రస్తావించారు. ధర్మసాగర్ మండలంలోని ఎల్కుర్తికి మంజూరైన సైనిక్ స్కూల్‌ను సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలించవద్దని కడియం సూచించారు. ఈ సైనిక్ స్కూల్ ఏర్పాటుకు 2017లోనే కేంద్రంతో ఒప్పందం చేసుకున్నామని, 49.32 ఎకరాలకు భూసేకరణ సీసీఎల్‌ఏ పరిశీలనలో ఉందని చెప్పారు. ఇటీవలే కేంద్రం కొత్తగా 100 సైనిక్ స్కూళ్లను మంజూరు చేసిందని, కేంద్రంతో కొట్లాడి రెండు నుంచి మూడు సైనిక్ స్కూళ్లను తెలంగాణకు తేవాలని ప్రభుత్వానికి సూచించారు. ఇక మడికొండ, రాంపూర్, ధర్మసాగర్ మధ్య గల డంపింగ్‌యార్డ్‌ను మడిపల్లి జయగిరి ప్రాంతానికి తరలించాలని ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీ జీరో అవర్‌లో భాగంగా పలువురు ప్రస్తావించిన అంశాలపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమాధానాలిచ్చారు. మూసి, మానేరు రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ పనులను కొనసాగించాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. ఈ రెండిండికీ టెండర్లు పూర్తయ్యాయని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయండి: డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

తన నియోజకవర్గంలోని చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సీటీస్కాన్, ఎంఆర్‌ఐ పరికరాలు, సిబ్బందిని నియమించాలని కోరారు. లద్నూరు తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నియోజవర్గానికి నీళ్లివ్వాలని, చెరువులను దేవాదుల నీళ్లతో నింపాలని, వేరుశనగ రైతులకు మద్దతు ధర ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

### గొల్లకురుమలకు ఎలా న్యాయం చేస్తారో చెప్పండి: పాయల్ శంకర్

గొల్లకురుమలకు గొర్రెలిచ్చేందుకు వడ్డీతో సహా డీడీలు కట్టించుకున్నారని, దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ నిలదీశారు. ప్రభుత్వం సహాయం చేయకపోయినా ఫర్వాలేదు.. కానీ విచారణ జరపుతామనడంతో అంతటా ఆందోళన నెలకొన్నదని, ప్రభుత్వం వెంటనే వడ్డీతో సహా ఆయా డబ్బులను తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినా అన్ని రోగాలు కవర్ కావడం లేదని అన్ని వ్యాధులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

### కొండగట్టు, నల్లగొండ ఆలయాలకు నిధులివ్వాలి: మేడిపల్లి సత్యం

కొండగట్టు, నల్లగొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. తన నియోజకవర్గంలో లెదర్ పార్క్, వరద కాల్వపై తూములు, నారాయణపూర్ రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. మిడ్‌మానేర్ భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గంగాధరకు డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని కోరారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం

### కల్వకుర్తిని పూర్తి చేయాలి: కసిరెడ్డి

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పెండింగ్ పనులను పూర్తిచేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఇప్పటికీ రూ.178 కోట్లు మంజూరు చేశారని, మరో రూ.40 కోట్లు మంజూరుచేసి పనులను పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఆమనగల్లులో 50 పడకల దవాఖానను ఏర్పాటు చేయాలని ప్రస్తావించారు.

### కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు ఇవ్వాలి: ఎంఎస్ రాజ్ ఠాకూర్

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలివ్వాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రభుత్వాన్ని కోరారు. కార్మికులు ప్రమాదాల బారినపడి మృత్యువాత పడుతున్నారని, చనిపోయినా నష్టపరిహారం ఇవ్వడంలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు.

### మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి: సునీతాలక్ష్మారెడ్డి

రాజన్న జోన్‌లో ఉన్న మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. హల్దీ వాగుపై గల 20-30 చెక్‌డ్యామ్‌లను కొండపోచమ్మ సాగర్ నీళ్లతో నింపాలని కోరారు.

### పత్తిని కొనుగోలు చేయండి: జీ వివేక్

చెన్నూరు నియోజకవర్గంలో పత్తిని కొనుగోలు చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే జీ వివేకానంద్ ప్రభుత్వాన్ని కోరారు. పత్తి కొనుగోలు చేయకపోవంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రస్తావించారు. నియోజకవర్గంలో 100 బోరుబావుల తవ్వకానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### ఓడిపోయినవారే అన్ని వర్క్‌లిస్తరట?: కాలె యాదయ్య

అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులే అన్ని వర్క్‌లిస్తరని ప్రచారం జరుగుతున్నదని.. ఇదేం విధానమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అసెంబ్లీలో ప్రశ్నించారు. జీవో 111 తొలగింపుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈసీ, మూసి నదులపై బ్రిడ్జిలు నిర్మించాలని ప్రస్తావించారు.

### సీఎంఆర్‌ఎఫ్ దరఖాస్తులను పరిష్కరించాలి : పాడి కౌశిక్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కోరారు. చిలుకవాగు బ్రిడ్జి, కల్వల ప్రాజెక్టు, చెక్‌డ్యామ్‌లను పునర్నిర్మించాలని విన్నవించారు. వావిలాల, శనిగరం, చల్లూరు, ఉప్పల్‌లో కొత్త మండలాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### హైదరాబాద్‌లో సమస్యలను పరిష్కరించండి: ఎంఐఎం ఎమ్మెల్యేలు

హైదరాబాద్‌లోని పలు సమస్యలను పరిష్కరించాలని ఎంఐఎం ఎమ్మెల్యేలు అసెంబ్లీ జీరో అవర్‌లో ప్రస్తావించారు. తన నియోజకవర్గంలోని బస్తీలకు ఆర్టీసీ బస్సులు రావడంలేదని, మినీ బస్సులు నడపాలని బహదూర్‌పుర ఎమ్మెల్యే మమ్మద్ ముబీన్ ప్రభుత్వాన్ని కోరారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో రాత్రి ఒంటి గంట వరకు వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల కోరారు. నర్సులను జోన్ వారీగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గోల్కొండ, కార్వాన్, జియాగూడల్లో నల్లా నీళ్లు కలుషితమవుతున్నాయని, సెక్షన్ మేనేజర్లు పట్టించుకోవడంలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. నాలాల్లో పూడికను తొలగించాలని యాకుత్‌పుర ఎమ్మెల్యే కౌసర్ మోయినొద్దీన్ కోరారు.

### సమస్యలు ప్రస్తావించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జీరో అవర్‌లో మాట్లాడారు. తమ నియోజకవర్గాల్లోని సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. తాండూరులో కంది బోర్డును ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. తాండూరు కందిపప్పుకు జియోట్యాగింగ్ వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కోట్‌పల్లి, జుట్టుపల్లి ప్రాజెక్ట్‌లకు నిధులివ్వాలని కోరారు. డోర్నకల్‌లో మిర్చి బోర్డు ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే జాటోత్ రామచందర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఒకే నెలలో 28 మంది గిరిజన రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, రైతులను ఆదుకోవాలని ప్రస్తావించారు. మైదాన ప్రాంత ఐటీడీఏ ఏర్పాటుచేయాలని, కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని, ఎస్‌ఎస్‌ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. దేవరకద్రలోని చిన్న చింతకుంటలో జూనియర్ కాలేజీ, నియోజకవర్గానికి డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని, దేవరకద్రలో 100 పడకల, కొత్తకోటకు 50 పడకల దవాఖానలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కోరారు. పట్టాలిచ్చిన పోడు భూముల్లో బోరుబావులు తవ్వుకునేందుకు అనుమతించాలని ఎమ్మెల్యే దొంతిమాధవరెడ్డి కోరారు. బెల్లంపల్లి నియోజకవర్గానికి తాగు, సాగునీటిని అందించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ విజ్ఞప్తి చేశారు. పేదలకు ఇండ్లు కట్టించి ఇవ్వాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కోరారు.

### సేవాలాల్ మహరాజ్‌కు గుడి: కోమటిరెడ్డి

బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాన్ని ప్రభుత్వం నిర్మించనున్నదని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసెంబ్లీ జీరో అవర్‌లో సభకు తెలిపారు.

### ఉప్పల్-నారపల్లి ఫ్లై ఓవర్‌ను పూర్తి చేయాలి: బండారి లక్ష్మారెడ్డి

నాచారం, కాప్రా, రామంతాపూర్ చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించకపోవడంతో దోమల బెడద తీవ్రమవుతున్నదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఉప్పల్‌కు మంజూరైన 100 పడకల దవాఖానను ప్రారంభించాలని కోరారు. ఉప్పల్-నారపల్లి ఫ్లైఓవర్, రోడ్లను త్వరగా పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు.

### ఎమ్మెల్యేనైనా అవమానాలు ఎదుర్కొంటున్నా: పైడి రాకేశ్‌రెడ్డి

మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తాను ప్రొటోకాల్ విషయంలో అనేక అవమానాలు ఎదుర్కొంటున్నానని ఆర్మూరు ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీకారం తీర్చుకోవడం, పగ పట్టడం సరికాదని అధికారులు సమయం, గౌరవం ఇవ్వడం లేదని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. కొత్త పెట్టుబడులను హైదరాబాద్ చుట్టూ కాకుండా ఉమ్మడి జిల్లాల్లో 20 శాతం చొప్పున ఉమ్మడి జిల్లాల్లో పెట్టేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. కొడంగల్‌లో రూ.100 కోట్లతో మాడల్ గురుకులాన్ని ఏర్పాటుచేసినట్టే ఆర్మూరులోనూ ఏర్పాటు చేయాలని కోరారు.

ఏఐపీడీ మీట్‌లో గెలుపొందిన ఐదు బంగారు, ఏడు వెండి పతకాలతో రాష్ట్ర పోలీసులు

## ఏఐపీడీ మీట్‌లో ఓవరాల్ చాంప్‌గా తెలంగాణ

- 5 గోల్డ్, 7 సిల్వర్ మెడల్స్ కైవసం
- విజేతలకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): లక్నోలో బాబూ జగ్జీవన్ రామ్ ఆర్‌పీఎఫ్ అకాడమీలో జరిగిన ఆలిండియా పోలీస్ డ్యూటీ (ఏఐపీడీ) మీట్‌లో తెలంగాణ పోలీసులు సత్తా చాటారు. ఈ నెల 12 నుంచి 16 వరకు జరిగిన ఈ మీట్‌లో రాష్ట్ర పోలీసులు మొత్తం 5 బంగారు, 7 వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. తద్వారా 12 ఏండ్ల తర్వాత ఓవరాల్ చాంపియన్‌గా అవతరించారు. సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్, పోలీస్ ఫొటోగ్రఫీ, కంప్యూటర్ అవేర్‌నెస్, స్పెషల్ కెనైన్ యూనిట్ కాంటెస్ట్, యాంటీ శాబోటేజ్ చెక్స్, పోలీస్ వీడియోగ్రఫీ విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణకు జీ రామకృష్ణారెడ్డి , డీ విజయ్ కుమార్, వీ కిరణ్ కుమార్, పీ అనంతరెడ్డి, ఎం దేవేందర్ ప్రసాద్ స్వర్ణ పతకాలు.. పీ పవన్, ఎన్ వెంకటరమణ, ఎం హరిప్రసాద్, కే శ్రీనివాస్, షేక్ ఖాదర్ షరీఫ్, సీహెచ్ సంతోష్, కే సతీశ్ రజత పతకాలు అందించినట్టు డీజీపీ రవిగుప్తా వెల్లడించారు. పతక విజేతలకు అభినందనలు తెలిపారు. ఏఐపీడీ మీట్‌లో 12 ఏండ్ల తర్వాత ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన తెలంగాణ జట్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. తెలంగాణ పోలీస్ శాఖ చార్మినార్ ట్రోఫీ సహా 5 గోల్డ్, 7 సిల్వర్ మెడల్స్ కైవసం చేసుకోవడం గొప్ప విషయమన్నారు. అసాధారణ ప్రతిభ కనబరిచిన తెలంగాణ పోలీసులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## ప్రజావాణిలో 1,346 దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): ప్రజాభవన్‌లోని ప్రజావాణిలో శుక్రవారం వివిధ అంశాలపై 1,346 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఇందులో అధికంగా ఇందిరమ్మ ఇండ్లు, భూ సమస్యల పరిష్కారానికి సంబంధించినవని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా తమకు ఉద్యోగాలు ఇవ్వాలని అధికారులకు డీఎస్సీ-2008 బాధిత అభ్యర్థులు వినతిపత్రం అందజేశారు. డీఎస్సీ-2008లో నష్టపోయిన బీఈడీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఈ నెల 8న మధ్యంతర ఉత్తర్వులిచ్చిందని గుర్తుచేశారు. ఈ మేరకు ప్రభుత్వం స్పందించి నియామకాలు జరపాలని కోరారు.

## కానిస్టేబుల్‌ను పొట్టన పెట్టుకున్న ముగ్గురి అరెస్టు

కాటారం, ఫిబ్రవరి 16: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేస్తూ వన్యప్రాణుల కోసం ఏర్పరిచిన విద్యుత్తు ఉచ్చుకు బలైన కానిస్టేబుల్ ప్రవీణ్ మృతికి కారణమైన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం సీఐ నాగార్జునరావు వెల్లడించిన వివరాల ప్రకారం.. కాటారానికి చెందిన ఊదరి రమేశ్, ఇప్పలపల్లికి చెందిన గోగుల రమేశ్, గజ్జెల శ్రీనివాస్ కూలీ డబ్బులు సరిపోవడం లేదని సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. దీంతో అటవీ ప్రాంతంలో విద్యుత్తు తీగలు అమర్చి ఆ ఉచ్చులో పడే జంతువుల మాంసాన్ని ఎక్కువ డబ్బులకు అమ్ముకునేవారు. ఈనెల 11న అటవీ ప్రాంతంలో సుమారు 2 కిలోమీటర్ల దూరం వరకు కర్రలు పాతి వాటికి కరెంటు వైరును కట్టారు. అదేరోజు రాత్రి 10.15 గంటల ప్రాంతంలో 13 మంది గ్రేహౌండ్స్ సిబ్బంది కాటారం అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదిలాబాద్ జిల్లా రాజోలిగూడకు చెందిన కానిస్టేబుల్ ఆడె ప్రవీణ్ (34) కరెంటు షాక్ తగిలి మృతి చెందిన విషయం తెల్సిందే.

# బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించండి

## రాష్ట్రపతి ముర్ముకు ఎన్‌సీఎస్‌సీ నివేదిక
## సందేశ్‌ఖాలీని సందర్శించిన కమిషన్
## బెంగాల్ అల్లర్లపై సుప్రీంలో పిల్ దాఖలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాల్సిన అవసరమున్నదని జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్(ఎన్‌సీఎస్‌సీ) రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నివేదించింది. సందేశ్‌ఖాలీలో టీఎంసీ మద్దతుదారులు మహిళలపై వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై ఎన్‌సీఎస్‌సీ నివేదికను రూపొందించి రాష్ట్రపతికి సమర్పించిందని కమిషన్ చీఫ్ అరుణ్ హల్దార్ శుక్రవారం తెలిపారు. టీఎంసీ నాయకుడు షాజహాన్ షేక్, అతని మద్దతుదారులు బలవంతంగా స్థానికుల భూములు లాక్కోవటమేగాక తమను లైంగికంగా వేధించారని పెద్ద సంఖ్యలో మహిళలు ఫిర్యాదు చేయటంతో ఎన్‌సీఎస్‌సీ ప్రతినిధి బృందం గురువారం సందేశ్‌ఖాలీని సందర్శించింది. రాష్ట్రపతికి నివేదికను సమర్పించిన తర్వాత కమిషన్ చీఫ్ అరుణ్ విలేకరులతో మాట్లాడుతూ సందేశ్‌ఖాలీలో స్థానికులపై జరిగిన దౌర్జన్యాలు, వారి అనుభవించిన హింసను వివరించారు. ఎస్సీల హక్కులను కాపాడేందుకు ఉద్దేశించిన ఆర్టికల్ 338 ప్రకారం పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితిపై రాష్ట్రపతి పాలన విధించాలని తాము సిఫారసు చేసినట్టు అరుణ్ తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం షెడ్యూల్డ్ రాజ్యాంగ భద్రతల పనితీరుపై ప్రతి ఏటా, ఇతర సమయాల్లో రాష్ట్రపతికి ఎన్‌సీఎస్‌సీ నివేదికలు సమర్పించాల్సిన బాధ్యత ఉన్నది. కమిషన్ ఇచ్చిన నివేదికను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్రపతి హామీ ఇచ్చినట్టు అరుణ్ తెలిపారు. సందేశ్‌ఖాలీలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని పేర్కొంటూ తమను ఆ ప్రాంతాన్ని సందర్శించకుండా అడ్డుకున్నారని కమిషన్ ఆరోపించింది. అంతేగాక తమ పర్యటనకు ఎలాంటి ఏర్పాట్లు కూడా అక్కడి ప్రభుత్వం చేయలేదన్నారు. రాష్ట్రంలో నేరగాళ్లు ప్రభుత్వంతో చేతులు కలిపారని అరుణ్ ఆరోపించారు. సందేశ్‌ఖాలీలో అల్లర్లకు, హింసకు, దౌర్జన్యానికి పాల్పడిన టీఎంసీ నేత షాజహాన్ షేక్‌పై రేషన్ కుంభకోణానికి సంబంధించి ఈడీ గత నెలలో అతని ఇంటిపై దాడి చేసనప్పటి నుంచి అతను పరారీలో ఉన్నాడని, వెంటనే అతడిని అరెస్ట్ చేయాలని చాలా మంది మహిళా బాధితులు డిమాండ్ చేస్తున్నారు. దేశంలోనే అత్యధికంగా ఎస్సీ జనాభా కలిగిన రాష్ట్రాల్లో బెంగాల్ రెండో స్థానంలో ఉన్నదని, హింసాకాండ వల్ల వారంతా ఇబ్బందులు పడుతున్నారని అరుణ్ చెప్పారు. అక్కడి హింసాకాండపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ నోటీసు కూడా పంపిన సంగతిని ఆయన గుర్తు చేశారు. బాధితులను రాష్ట్ర ప్రభుత్వం కాపాడటం లేదని, టీఎంసీ పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రతినిధి బృందాలు కూడా సందేశ్‌ఖాలీని సందర్శించాల్సి ఉన్నది, కానీ అక్కడ శుక్రవారం కూడా పరిస్థితి ఉద్రిక్తంగానే ఉన్నది.

సందేశ్‌ఖాలీ బాధితురాలిని పరామర్శిస్తున్న గవర్నర్ సీవీ ఆనంద బోస్

### సుప్రీం కోర్టు దృష్టికి సందేశ్‌ఖాలీ అంశం

సందేశ్‌ఖాలీలో మహిళలను లైంగికంగా వేధించిన అంశం ఇప్పుడు సుప్రీం కోర్టు ముందుకు వచ్చింది. దీనిపై విచారణను పరిశీలిస్తామని భారత ప్రధాన న్యాయమూర్తి వెల్లడించారు. సందేశ్‌ఖాలీ దౌర్జన్యాలపై గురువారం ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలైంది. ఈ అంశంపై సీబీఐ లేదా సిట్‌తో కోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని పిల్‌లో కోరారు. అలాగే విచారణను అత్యవసరంగా చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సందేశ్‌ఖాలీ బాధితులకు పరిహారంతో పాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ కోరారు. అలాగే ఈ కేసు దర్యాప్తు, విచారణను పశ్చిమ బెంగాల్ నుంచి తప్పించాలన్నారు.

## ఇన్‌శాట్-3డీఎస్ కౌంట్‌డౌన్ ప్రారంభం

**నేడు సాయంత్రం 5.35 గంటలకు ప్రయోగం**

చెన్నై, ఫిబ్రవరి 16: ఇన్‌శాట్-3డీ వాతావరణ ఉపగ్రహానికి కౌంట్‌డౌన్ మొదలైంది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు జీఎస్‌ఎల్వీ-ఎఫ్ 14 వ్యోమనౌక ద్వారా దీన్ని నింగిలోకి పంపనున్నట్టు ఇస్రో వెల్లడించింది. మూడో తరం వాతావరణ ఉపగ్రహమైన ఇన్‌శాట్- 3డీఎస్‌ను భూ స్థిర కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. కేంద్ర భూ విజ్ఞాన శాఖ ఈ ఉపగ్రహ ప్రయోగానికి నిధులు సమకూర్చింది.

## భూ వాతావరణంలోకి కార్టోశాట్-2

### విజయవంతంగా తిరిగి తీసుకొచ్చిన ఇస్రో
### 17 ఏండ్లపాటు సేవలందించిన ఉపగ్రహం

*బెంగళూరు, ఫిబ్రవరి 16: అధిక రెజల్యూషన్ గల ఫొటోలు తీసే ఇస్రో రెండో తరంలోని మొదటి ఉపగ్రహమైన కార్టోశాట్-2ను శుక్రవారం విజయవంతంగా భూ వాతావరణంలోకి తీసుకొచ్చినట్టు ఆ సంస్థ వెల్లడించింది. ఈ ఉపగ్రహం 17 ఏండ్ల పాటు సేవలందించింది. 'సాయంత్రం 3.48కి హిందూ మహా సముద్రం మీదకు ఈ ఉపగ్రహాన్ని తీసుకొచ్చాం. దీన్ని దహనం చేస్తాం లేదా సముద్రంలో పడిపోయేలా వదిలేస్తాం' అని ఇస్రో అధికారి ఒకరు తెలిపారు. కార్టోశాట్ గమనాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నట్టు ఇస్రో తెలిపింది. ఈ శాటిలైట్ భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించినప్పుడు దాని అన్ని ప్రధాన భాగాలు విచ్ఛిన్నమైపోతాయని వెల్లడించింది. 2007లో ప్రయోగించిన ఈ శాటిలైట్ 2019 వరకు పట్టణ ప్రణాళిక కోసం హై రెజల్యూషన్ కలిగిన ఫొటోలు తీసి పంపింది. అంతర్జాతీయ అంతరిక్ష మార్గదర్శకాల ప్రకారం దీన్ని ధ్వంసం చేయాలనుకుంటున్నట్టు ఇస్రో చెప్పింది. సహజంగా కార్టోశాట్-2 తన కక్ష్య నుంచి విడిపోవడానికి 30 ఏండ్లు పడుతుందని భావించారు.*

## మరో పాతికేళ్లలో అమెజాన్ అడవులు సగం ఖాళీ!

న్యూఢిల్లీ: దక్షిణ అమెరికాలోని 8 దేశాల్లో విస్తరించిన అమెజాన్ అడవులు అంతరించిపోతున్నాయి! విస్తీర్ణంలో భారత్ కంటే దాదాపు రెట్టింపుగల ఈ అడవులు 2050 నాటికి సుమారు 47 శాతం తగ్గిపోబోతున్నాయని బ్రెజిల్‌లోని ఫెడరల్ యూనివర్సిటీ ఆఫ్ శాంటా కాటరినా విడుదల చేసిన నివేదిక తెలిపింది. దీనికి కారణం వాతావరణంలో ఉష్ణోగ్రతల పెరుగుదల, కార్చిచ్చులు, అడవుల నరికివేత, ఆక్రమణలు అని వివరించింది. ప్రపంచ పర్యావరణ వ్యవస్థ పరిరక్షణకు కీలకంగా ఉపయోగపడుతున్న అమెజాన్ అడవుల్లో ఇప్పటికే 15 శాతం నాశనమైనట్లు తెలిపింది. ఈ పరిస్థితి మరింత తీవ్రమైతే, ఈ అటవీ ప్రాంతం ఉష్ణమండల పచ్చిక బయలుగా మారిపోవచ్చునని అంచనా వేసింది.

## ప్రముఖ చెఫ్ ఇంతియాజ్ ఖురేషీ ఇకలేరు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16: పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ చెఫ్ ఇంతియాజ్ ఖురేషీ (93) శుక్రవారం తెల్లవారుజామున మరణించారు. ఐటీసీ హోటల్స్‌లో ఖురేషీ మాస్టర్ చెఫ్. 1931లో లక్నోలోని చెఫ్‌ల కుటుంబంలో జన్మించిన ఖురేషీ దమ్ పుఖ్త్ వంటకాన్ని పునరుద్ధరించినందుకు ప్రశంసలు అందుకున్నారు. 2015లో ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్‌తో మాట్లాడిన సందర్భంలో బిర్యానీ అంటూ ఏదీ లేదని.. అన్నీ పులావ్‌లు మాత్రమేనని సంచలన కామెంట్స్ చేశారు ఖురేషీ. ఆయనే చెప్పుకున్నట్టు జీవితాంతం అత్యాశ లేకుండా నిజాయితీగా పనిచేశారు ఖురేషీ. ఆయన మృతి వార్త తెలుసుకున్న పలువురు సోషల్ మీడియా వేదికగా సంతాపాన్ని తెలిపారు.

## 2 లక్షల నిరుద్యోగుల్లో 32 మందికి ఉద్యోగం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగా): గుజరాత్‌లో మొత్తం 2.38 లక్షల మంది నిరుద్యోగులు ఉపాధి కోసం రిజిస్టర్ చేసుకుంటే, గత రెండేళ్లలో కేవలం 32 మందికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించింది. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, గుజరాత్‌కు చెందిన 29 జిల్లాల్లో గత రెండేళ్లలో 2,38,978 మంది ఉన్నత విద్య చదువుకున్న నిరుద్యోగులు ఉద్యోగాల కోసం తమ పేరును రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. గుజరాత్ ప్రభుత్వ గణాంకాల ప్రకారం గత రెండేళ్లలో కేవలం 32 మందికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు రాగా, అందులో 22 మంది అహ్మదాబాద్ వాసులు, మరో 9 మంది భావ్‌నగర్ వాసులు కాగా, ఒకరు గాంధీనగర్ వాసి. ఉద్యోగాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో అత్యధికంగా ఆనందనగర్ నుంచి 21,633 మంది నిరుద్యోగులు ఉన్నారు.



## నైకీలో 1600 మంది ఉద్యోగులకు ఉద్వాసన

వాషింగ్టన్: ప్రముఖ స్పోర్ట్స్‌వేర్ తయారీ సంస్థ నైకీ 1600 మందికిపైగా ఉద్యోగులను తొలగించనున్నది. ప్రపంచవ్యాప్తంగా తమ కంపెనీలో పనిచేస్తున్న వారిలో 2 శాతం మందిని తొలగిస్తున్నట్టు శుక్రవారం ఆ సంస్థ వెల్లడించింది. సంస్థలో ప్రస్తుతం 83,700 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వ్యయ నియంత్రణలో భాగంగానే ఉద్యోగులను తొలగిస్తున్నట్టు కంపెనీ తెలిపింది. భవిష్యత్తు విక్రయాల అంచనాలు నిరాశాజనకంగా ఉన్న నేపథ్యంలో, వృద్ధి అవకాశాలను మెరుగుపరచుకోవడానికి కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదని పేర్కొన్నది.

## వంగా భవిష్యవాణి నిజమవుతున్నదా?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): ఆధునిక నోస్ట్రాడమస్‌గా పిలువబడే బల్గేరియన్ ఆధ్యాత్మికవేత్త బాబా వంగా 2024కు సంబంధించి గతంలో చెప్పిన భవిష్యవాణి నిజమౌతున్నదని సోషల్‌మీడియాలో నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. వంగా అంచనా వేసినట్టే క్యాన్సర్‌కు వ్యాక్సిన్‌ను త్వరలో అభివృద్ధి చేయనున్నట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ చేసిన ప్రకటనను ఇందుకు ఉదహరిస్తున్నారు. అలాగే, బ్రిటన్‌లో ఆర్థిక సంక్షోభం కొనసాగుతుండటం, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ ర్యాంకుల్లో జపాన్ నాలుగో స్థానానికి పరిమితమవ్వడం వంటి అంశాలను కూడా ఉటంకిస్తున్నారు. ఇవన్నీ, గతంలోనే వంగా భవిష్యవాణిలో ఊహించినట్టు పేర్కొంటున్నారు. అయితే, 2024లో జరుగబోయే మరి కొన్ని విపత్తులు, విషాదాల గురించి కూడా వంగా తన భవిష్యవాణిలో ముందుగానే అంచనా వేశారు. ఇప్పుడు అవి కూడా నిజమౌతాయా? అనే చర్చ పెద్దయెత్తున జరుగుతున్నది. కాగా వంగా గతంలో అంచనా వేసిన విధంగానే ట్విన్ టవర్ ఎటాక్స్, ప్రిన్సెస్ డయానా మృతి, చర్నోబిల్ ఉదంతం, బ్రెగ్జిట్ వ్యవహారం నిజంగానే జరుగడం తెలిసిందే.

**2024కు సంబంధించి వంగా అంచనా వేసిన మరికొన్ని అంశాలు**

- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై హత్యాయత్నం జరుగుతుంది.
- ఐరోపా దేశాలపై ఉగ్రవాదులు భీకరంగా దాడులకు తెగబడుతారు.
- ప్రపంచ యవనికపై తన ప్రాధాన్యాన్ని పెంచుకొంటున్న ఓ దేశం.. జీవాయుధాలను పరీక్షించడమే కాదు, దానితో దాడులకు తెగబడుతుంది.
- గతంలో ఎన్నడూచూడని స్థాయిలో వాతావరణంలో మార్పులు కనిపిస్తాయి.
- పవర్ గ్రిడ్స్, వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్స్, దేశాల భద్రతే లక్ష్యంగా సైబర్ దాడులు జరుగుతాయి.
- క్వాంటమ్ కంప్యూటింగ్‌లో విప్లవాత్మకమైన ఆవిష్కరణలు వెలుగుచూస్తాయి.